ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

ఉపాధి పనులు కల్పించాలి

- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- 153 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపిడిఒలను ఆదేశించారు..శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సర్వే శుక్రవారం నుండి ప్రారంభం అయిందన్నారు. ప్రభుత్వం ఈ అంశానికి ప్రాధాన్యత ఇస్తోందని, సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. సాగు నీటి సంఘాల ఎన్నికలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నియమ నిబంధనలు ప్రకారం నిర్వహించాలన్నారు. రీ సర్వేకి సంబంధించి గ్రామ సభలు నిర్వహించడం ద్వారా వచ్చిన 18 వేల అర్జీలను పిజిఆర్ఎస్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 31వ తేది నాటికి అర్జీలను అన్నింటినీ నాణ్యతతో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత తహశీల్దార్‌లకు సూచించారు. హౌసింగ్‌కి సంబంధించి పురోగతి చూపని 153 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వీరి వివరణల్లో సరైన కారణం లేకపోతే ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.. ఆప్షన్ త్రీకి సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్లతో పిడి హౌసింగ్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు సమావేశం ఏర్పాటు చేసుకొని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి, ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆప్షన్-1, 2కు సంబంధించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు.. ఇళ్లను మొదలుపెట్టని వారికి నోటీసులు ఇచ్చి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు లక్ష్యాలను నిర్దేశించి రోజూ సమీక్షించాలని ఎంపిడిఒలకు సూచించారు. ఆదోని, కౌతాలం, కోసిగి మండలాల ఎంపిడిఒలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్ట్‌లు ఖాళీగా పెట్టి పనులు కల్పించకుండా ఉన్నారని, పనులు కల్పించకపోతే కూలీలు ఏమవ్వాలని ప్రశ్నించారు. కూలీలకు పనులు కల్పించడంలో ఆదోని మండలం 50 శాతం మాత్రమే లక్ష్యాలు సాధించడంపై ఎంపిడిఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఫిల్టర్ బెడ్స్, ఇతర సమస్యలను 15వ గ్రాంట్ నిధులు, జడ్పీ, మండల పరిషత్ నిధులతో వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, ఇన్చార్జి హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి పురిటి కష్టాలు..

- ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగానే రక్తస్రావం
- ప్రాథమిక వైద్యశాలలో ప్రసవం చేసి తల్లీబిడ్డను కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని క్రాంతి నగర్ కాలనీ చెందిన నిండు గర్భిణీ లలిత పురిటి నొప్పులతో కష్టాలు పడింది. సమీప బంధువు గర్భిణిని కాన్పు కోసం ఆస్పత్రికి ద్విచక్ర వాహనంపై తీసుకెళుతుండగానే ప్రసవమయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఆదోని పట్టణ శివారు కాలనీ క్రాంతి నగర్‌లో గర్భిణి లలిత నివసిస్తుంది. శుక్రవారం ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. కాలనీ నుండి ఆసుపత్రికి రావడానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు దిక్కుతోతచ లేదు. వెంటనే ఆమెను సమీప బంధువు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి బయల్దేరారు. రద్దీగా ఉన్న రహదారిలో ఆసుపత్రి చేరుకోవడానికి ఆలస్యం కావడంతో గర్భిణికి పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. రక్తస్రావం జరిగి, శిశువు తల బయటకు రావడంతో వెంటనే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్లాడు. కానీ అక్కడ సాధారణంగా ప్రసవాలు చేయరు. కానీ విధుల్లో ఉన్న స్త్రీ వ్యాధి నిపుణులు ప్రియాంక, భరత్, నర్సులు అన్నపూర్ణ, కళావతి, హైమా, కల్యాణిలు స్పందించి గర్భిణికి ప్రసవం చేశారు. తల్లీ బిడ్డకు ప్రాణపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రికి తరలించారు. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉండటంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా బీకే వెంకటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో డిఆర్‌డిఎ పిడి, కర్నూలు ఆర్డీవోగా పని చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శేషిరెడ్డిని నియమించారు. ఇక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న మల్లికార్జునను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

డయల్ 1930 నంబర్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోలీసులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే ముఖ్యం

- డయల్ 1930 నంబర్‌పై కరపత్రాలతో ప్రజలకు అవగాహన : ఎస్పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే చాలా ముఖ్యమని జిల్లా ఎస్పి జి.బిందు మాధవ్ తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన డయల్ 1930 నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది సైబర్ నేరాల నియంత్రణకు, కట్టడికి సైబర్ నేరాల అవగాహన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారన్నారు. ప్రతి ఇంటికి ఇచ్చి ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రజలు వాటిని చూసి చదువుకునేందుకు వీలుగా ముద్రించినట్లు తెలిపారు. ఆయా డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలలో, రద్దీ ప్రాంతాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, గ్రామ సచివాలయాలలో, రైల్వేస్టేషన్‌లలో, బస్టాండ్‌లలో జనం రద్దీగా ఉండే చోట్ల ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఒక్క రోజే దాదాపు 8 వేల మందికి సైబర్ నేరాల అవగాహన కరపత్రాలను పంచి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడమే కాకుండా వాటిని ఎలా అరికట్టవచ్చో కూడా ప్రజలకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒపెన్ చేయకూడదని హెచ్చరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరికి వాటి పట్ల అవగాహన అవసరమన్నారు. సైబర్ నేరగాళ్ల చేసే మోసాల పట్ల చాలా మందికి అవగాహన లేకపోవడంతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలు చేసే క్రమంలో టెక్నాలజీని వాడుతున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే స్వీయ అప్రమత్తత ముఖ్యమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలు చేయరాదు

- లైంగిక దాడులు, వేధింపులపై అవగాహన కల్పించాలి : జెసి బి.నవ్య

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. కిశోర బాలికలకు బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులపై అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయిలో కిషోర్ వికాసంపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం కర్నూలులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిక అధికారి పి వెంకట లక్ష్మమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ శిక్షకులు బాలికలకు ముఖ్యంగా అడల్సన్స్ ఏజ్‌లో వచ్చే హెల్త్, న్యూట్రిషన్ మెన్సురేషన్ మొదలైన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు.చడం జరిగింది. గ్రామ, మండల స్థాయిలో కిశోర బాలికలు ఎదుర్కొంటున్న బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులు మొదలైన వాటిపై శిక్షకులు అవగాహన కల్పించినప్పుడే ఈ శిక్షణ కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందన్నారు. మండల, గ్రామస్థాయిలో ఉన్న కమిటీలను బలోపేతం చేయడానికి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం బాల బాలికలకు సంబంధించిన అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్ పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన స్టేట్ రిసోర్స్ సభ్యులు పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రుతు స్రావం, బాల్య వివాహాలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్డిఏ, ఐసిడిఎస్, మున్సిపాలిటీ, ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ ఆర్కే, ఎస్కే, ఎన్జీవో ప్రతినిధులు, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్, సభ్యులు, మెప్మా తదితర శాఖలకు సంబంధించిన శిక్షకులు పాల్గొన్నారు.

3, 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

- ఇన్‌ఛార్జి వైఎస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 6,531 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5848 మంది విద్యార్థులు హాజరయ్యారు. కర్నూల్ నగరంలోని పరీక్షా కేంద్రాలను వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విసి ఎన్‌టికె నాయక్

15లోపు పంటల బీమా చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సాలు రెడ్డి

ప్రజాశక్తి - సి.బెళగల్

సి.బెళగల్ మండలంలో అన్ని గ్రామాల రైతులు డిసెంబర్ 15లోపు పంటల బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్ సాలు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బెళగల్‌లోని రైతు సేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ సమక్షంలో మండలంలో రబీ పంటల సాగు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఆయా పంటలను బట్టి బీమాను చెల్లించి రశీదు పొందాలని సూచించారు. అలాగే వేరుశెనగ సాగుకు నవంబర్, డిసెంబర్ అనుకూలమని, 30 కేజీల ప్యాకెట్‌ను సబ్సిడీ పోను రూ.1785 చెల్లించి తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒలు వెంకటేశ్వర్లు, సంధ్య, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాలు రెడ్డి

బీసీ హాస్టల్‌కు తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తిలోని బీసీ బాలికల వసతి గృహంలో సుమారు 350 మంది విద్యార్థినులు ఉన్నారు. చాలా రోజుల నుంచి మంచినీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని టిడిపి మండల కన్వీనర్ బలరాం గౌడ్, రమాకాంత్ రెడ్డి పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు చాలా రోజుల నుంచి రిపేరీలో ఉన్న బోరును, వాటి మోటార్లను స్వయంగా దగ్గర ఉండి వారు రిపేరు చేయించి సమస్యను పరిష్కరించారు. నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, స్పందించి సమస్యను పరిష్కరించినందుకు శుక్రవారం ఎమ్మెల్యేకు, టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్కుల్లో వసతుల కల్పనకు చర్యలు

- కమిషనర్ రవీంద్రబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో ఉన్న పార్కుల్లో అవసరమైన వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన 42వ వార్డులో వాణిజ్య నగర్ పార్కు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో సమస్యలపై చర్చించారు. జనవివాసాల మధ్యలో పిచ్చి మొక్కలు తొలగించాలని, ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలి

- బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామరాజు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

త్వరలో జరగబోయే రాజ్యసభ, శాసన మండలి స్థానాల్లో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటరామరాజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో బ్రాహ్మణులు 95 శాతం టిడిపికి మద్దతు ఇచ్చారని, బ్రాహ్మణులకు చట్టసభల్లో ప్రతినిధ్యం కల్పిచాలని కోరారు.

పంచలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సోమిశెట్టి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సతీసమేతంగా పంచలింగాలలోని పంచలింగేశ్వర స్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు. స్థానికులు వి.రామ్మోహన్, వి.తిరుమలేష్, వి.విజయ్ కుమార్, వి.తిరుమల బాబు, వి.బాలాజీ, వి.పురుషోత్తం, రవి శెట్టిలు సోమిశెట్టి వెంకటేశ్వర్లు దంపతులకు పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కోడుమూరు నియోజకవర్గం పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న కర్నూలు, సి.బెళగల్, కోడుమూరు, గూడూరు మండలాలకు చెందిన బాధితులకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం నగరంలోని టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి స్వగృహంలో చెక్కులు అందజేశారు.

జాతీయస్థాయిలో గుర్తింపు తేవాలి

- సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

క్రీడారంగంలో కర్నూలుకు జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. శుక్రవారం నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేశారు. డిసెంబర్ 1, 2, 3న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే అంతర్ జిల్లాల ఆట్యాపాట్యా క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కర్నూలులో క్రీడారంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భీమవరంలో జరిగే అంతర్ జిల్లాల ఆట్యా పాట్యా పోటీల్లో జిల్లా జట్టు క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. భీమవరం లాంటి దూర ప్రాంతాలకు వెళ్తున్న నేపథ్యంలో క్రీడాకారులు మంచి దుప్పట్లను తీసుకెళ్లాలని సూచించారు. బయట ఎక్కడపడితే అక్కడ ఆహారాన్ని తీసుకోకుండా శుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ పెరుగుతుందని, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కర్నూలులో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం ఉంటుందని తెలిపారు. జిల్లా ఆట్యా పాట్యా సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పత్తికొండ

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. పత్తికొండలోని శ్రీరాముల నగర్‌లో పెద్ద సుంకన్న అనే వ్యక్తికి డెంగీ అనుమానిత కేసు నమోదు కావడంతో శుక్రవారం కాలనీలో ఆరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. జ్వరం ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. పారిశుధ్య సిబ్బందితో దోమల మందు పిచికారి చేయించారు. ఇంటింటి ఫీవర్, లార్వా సర్వే నిర్వహించి లార్వా ఉన్న కంటైనర్లను తొలగించారు. ఆయన మాట్లాడుతూ... దోమల వల్ల వచ్చే మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే చికిత్స తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య పర్యవేక్షకులు రవికుమార్, ఆరోగ్య కార్యకర్త చాముండేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మద్రిస్వామి, ఆశా కార్యకర్తలు ఎర్రలక్ష్మి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

మొబైల్‌కు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలని వన్ టౌన్ సిఐ రామానాయుడు తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత బస్తిలో ఉన్న నారాయణ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐ మాట్లాడారు. మొబైల్‌లో వచ్చే అసభ్యకరమైన దృశ్యాలు, మోసపూరిత ప్రకటనలను చూడరాదన్నారు. విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టి సారించాలని కోరారు. ప్రిన్సిపల్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

షరీఫ్‌ను కలిసిన నంద్యాల నాగేంద్ర

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారులుగా ప్రమాణం స్వీకారం చేసిన ఎంఎ.షరీఫ్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఆర్య, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి బషీర్ అహ్మద్ కలిశారు. విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని నూతన పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి

ప్రజాశక్తి - వెల్దుర్తి

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందిన సంఘటన వెల్దుర్తిలోని రామళ్లకోట రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. ఓర్వకల్లుకు చెందిన వడ్డే వెంకటరమణ కుమారుడు వడ్డే మల్లికార్జున (25) అదే గ్రామానికి చెందిన బండల ట్రాక్టర్‌కు లేబర్ పని చేసేవారు. శుక్రవారం ఓర్వకల్లు నుంచి క్రిష్ణగిరి మండలం ఎర్రగుడికి బండల లోడు తీసుకెళ్తుండగా వెల్దుర్తి సమీపంలో ట్రాక్టర్ టైరు పగలడంతో ట్రాలీ బోల్తా పడింది. మల్లికార్జునపై బండలు పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణ, నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన వారిని వెల్దుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొత్త ఇంటికి దరఖాస్తు చేసుకోండి

- ఎమ్మెల్యే శ్యామ్ కుమార్

ప్రజాశక్తి - తుగ్గలి

సొంతిల్లు లేని వారికి పిఎంఎవై (అర్బన్)-2.0 కింద కొత్తగా గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. స్థలాలున్న వారికి పిఎంఎవై (అర్బన్) కింద కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష మొత్తం రూ.2.50 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పిఎంఎవై గ్రామీణ్ కింద గ్రామాలకు ఒక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం చెల్లించనుందని చెప్పారు. అర్హులు దరఖాస్తు ఫారంతో పాటు భార్య, భర్త ఇద్దరి ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పార్టీ సభ్యత్వం ముమ్మరం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లాలో టిడిపి సభ్యత్వాన్ని ముమ్మరం చేయాలని జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతనెల 26న టిడిపి సభ్యత్వ నమోదును రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించారని తెలిపారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు ప్రారంభించారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1.35 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఎపిసిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా టి.శ్రీనివాసులు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం డిఇఒ శ్యాముల్ పాల్ ఇన్‌ఛార్జీ ఎపిసిగా కొనసాగుతున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీనివాసులు కావలిలో పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటేషన్ మీద విద్యాశాఖకు బదిలీ అయ్యారు.

విద్యాశాఖ ఎడిగా నాగభూషణం

- ఇద్దరు సూపరింటెండెంట్లకు ఎడిలుగా పదోన్నతి

జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఎడిగా పనిచేస్తున్న నాగభూషణంను ఇక్కడికి బదిలీ చేశారు. డిఇఒ కార్యాలయంలో సూపరింటెండెంట్లుగా పని చేస్తున్న రవికుమార్, రాజశేఖర్‌కు ఎడిలుగా ప్రమోషన్ కల్పించారు. రవికుమార్‌ను అన్నమయ్య డిఇఒ కార్యాలయం, రాజశేఖర్‌ను అనంతపురం డిఇఒ కార్యాలయానికి బదిలీ చేశారు.

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

ప్రజాశక్తి - సిబెళగల్

బెళగల్‌లోని పోలీసు స్టేషన్‌ను కర్నూలు రేంజ్ డీఎస్పీ బాబు ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా కోడుమూరు సిఐ తామ్రేజ్ సమక్షంలో డీఎస్పీకి బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు. అలాగే కేసుల రికార్డులను తనిఖీ చేసి కేసుల పూర్వాపరాలను ఎస్ఐ తిమ్మారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి ప్రజలకు, బాధితులకు సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో బెల్టు షాపుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

తనిఖీ చేస్తున్న డీఎస్పీ

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్‌లో ఆర్‌యుకు మూడోస్థానం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

మహిళా జట్టు

ఇటీవల జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ ఉమెన్ పోటీల్లో ఆర్‌యు బ్యాడ్మింటన్ మహిళా జట్టు పోరాడి మూడో స్థానం కైవసం చేసుకుంది. రాజస్థాన్‌లోని శ్రీజగదీశ్‌ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా విశ్వవిద్యాలయం డిసెంబర్ 3 నుంచి 6 వరకు నిర్వహించే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ ఉమెన్ టోర్నమెంట్‌కు కూడా అర్హత సాధించింది. యూనివర్శిటీ బ్యాడ్మింటన్ మహిళల జట్టు వరుసగా మూడుసార్లు ఆలిండియాకు అర్హత సాధించింది. శుక్రవారం యూనివర్శిటీ వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ ఎన్‌టికె.నాయక్ జట్టు సభ్యులకు అభినందనలు తెలుపుతూ అఖిల భారత పోటీల్లో స్వర్ణం సాధించాలని కోరారు.

బ్యాడ్మింటన్ మహిళా జట్టు క్రీడాకారులు

ఎం.ఆకాంక్ష, ఎన్.జాహ్నవి, సి.హెచ్.ఎస్ఆర్.ప్రణవి, ఎఫ్.షిరీన్, ఎల్.మహైక్యలు నంద్యాలలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలకు చెందినవారు. కోచ్, మేనేజర్ జి.హేమంత్ రెడ్డి. వైస్ ఛాన్సిలర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ టీమ్‌కి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. వీరు ఈనెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నిర్వహించే సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు.

యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పురుషుల జట్టు

అబ్దుల్లా (శ్రీలక్ష్మి బిపిఇడి), వీరేష్ (ఎఎండ్ఎస్‌సి, ఆదోని), పర్వేజ్ (ఉస్మానియా, కర్నూలు). కోచ్ యూసుఫ్.

రిజిస్ట్రార్ డాక్టర్ విజయ్ కుమార్ నాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కెవి.శివకిషోర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

- గుంతలతో ప్రజల అవస్థలు
- మరమ్మతులకు కూడా నోచని వైనం

ప్రజాశక్తి - హాలహర్వి

రహదారి గుంతమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. గుంతలు పడిన రోడ్డుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. కర్ణాటక సరిహద్దు హాలహర్వి సమీపంలోని ఆదోని-బళ్లారి వయా మొక రోడ్డును పదేళ్ల క్రితం నిర్మించారు. ఈ రోడ్డు గుంతమయమైంది. కనీసం గుంతలను కూడా పూడ్చలేదు. రోజుకు వందలాది బస్సులు నిత్యం ఈ రోడ్డుపైనే తిరుగుతుంటాయి. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే వాహనదారులు భయపడుతున్నారు. రోజూ ఆదోని నుంచి బళ్లారికి నిత్యం వందలాది బస్సులు నడుస్తుంటాయి. రోడ్డుపై గుంతలు తప్పించబోయి చాలామంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతలమయమైన రహదారి

చైర్మన్‌గా బొజ్జమ్మ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - దేవనకొండ

విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో వాల్మీకి/బోయ ఫెడరేషన్ చైర్మన్‌గా కప్పట్రాళ్ల బొజ్జమ్మ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తమ కుటుంబం 40 సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడినందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఈ పదవి తనకు కట్టబెట్టారని తెలిపారు. కుల వృత్తి బీసీ వాల్మీకి/బోయ కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. తనకు ఛైర్మన్ పదవి ఇవ్వడం పట్ల అధినేత చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బొజ్జమ్మ భర్త, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న బొజ్జమ్మ

ఆలూరు : రాష్ట్ర ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కప్పట్రాళ్ల బొజ్జమ్మకు రాజధాని అమరావతిలో ఎఎండి ఉమాదేవి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బొజ్జమ్మ మాట్లాడుతూ... వాల్మీకి/బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి.జనార్ధన్, ఐజి ఆకె.రవికృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు.

బాలికల భద్రత.. సామాజిక బాధ్యత

- తహశీల్దార్ శ్రీనివాస్

ప్రజాశక్తి - నందవరం

బాలికల భద్రత... సామాజిక బాధ్యత అని తహశీల్దార్ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుధావతి, వైద్యాధికారి శ్రీలేఖ తెలిపారు. శుక్రవారం నందవరంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆర్‌డిటి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు లేని మండలంగా నందవరాన్ని తీర్చిదిద్దేందుకు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురి కావడం, ప్రసవ సమయంలో తల్లి, బిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడుతూ... ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పని చేసినప్పుడే బాల్య వివాహాలను నివారించవచ్చని తెలిపారు. ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ రంగమ్మ, మహిళా పోలీసు గీతా, ఎఎన్‌ఎం ఖాజాబున్ని, ఆర్‌డిటి సిఒ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

టిడిపితోనే గ్రామాలాభివృద్ధి

- టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ వరదరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపితోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ వరదరాజులు తెలిపారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో, టవర్ ఏరియాలో వేస్తున్న సిసి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన 6 నెలల్లోనే టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి చొరవతో 5 రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో భాగంగానే రూ.10 లక్షలతో ఒక రోడ్డును, రూ.5 లక్షలతో టవర్ వద్ద రోడ్డుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. త్వరలో మిగిలిన రోడ్ల పనులు కూడా మొదలు పెడతారని తెలిపారు. టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, ఎంపిటిసి వెంకటేష్, నాయకులు భీమేష్, మేకల నరసింహ, పిఆర్ ఎఇ మల్లయ్య పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- తహశీల్దార్ రవి, సిఐ రామాంజులు

ప్రజాశక్తి - మంత్రాలయం

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.రవి, సిఐ రామాంజులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, ఎస్ఐ పరమేష్ నాయక్, ఎన్‌హెచ్ ఎఇ శేఖర్ సూచించారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు చైతన్యం పరుస్తున్నట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు నెంబర్లకు ఫోన్ చేసి 'మీకు పార్సిల్ వచ్చింది. అందులో గంజాయి, బ్రౌన్ షుగర్ వంటి నిషేధిత మత్తు మందు ఉంది. మీపై కేసు నమోదు అవుతుంద'ని బెదిరింపులకు గురి చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. డబ్బును పెట్టుబడి పెడితే రెండింతలు, షేర్ల ద్వారా మూడింతలు ఆదాయం వస్తుందని మోసపోయిన వారు కూడా ఉన్నారని తెలిపారు. అలాంటి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అకౌంట్లు బ్లాక్ అయ్యాయని, ఓటిపి నెంబర్ చెబితే మళ్లీ అకౌంట్ ఓపెన్ అవుతుందని బ్యాంకుల నుంచి ఫోన్ చేసినట్లు చెబుతూ మభ్య పెడుతున్నారని తెలిపారు. లింక్‌ను పంపిస్తామని.. క్లిక్ చేస్తే అకౌంట్ ఓపెన్ అవుతుందని మోసం చేసిన ఘటనలూ జరిగాయని చెప్పారు. ఇలాంటివి ఎస్‌బిఐ అకౌంట్ల ద్వారా అధికంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్‌లో ఛార్జింగ్ లేదని, ఫోన్ చేసి ఇస్తానని చెప్పి ఫోన్ చేస్తున్నట్లు నటించి అకౌంట్లలో ఉన్న డబ్బు నొక్కేస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోజుకు రూ.వెయ్యి, రూ.2 వేలకు పైగా సంపాదించుకునే అవకాశం ఉందని చెప్పి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, మెసేజ్ వంటి వాటి నుంచి కూడా లింక్‌లు ఇచ్చి సంపాదన పెంచుకోవాలని ఆశ చూపెడతారని, అలాంటి వారికి దూరంగా ఉండాలని తెలిపారు. ఈ విధంగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన కాల్స్‌కు, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా మోసపోయినట్లు తెలిస్తే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ పరమేష్, హోంగార్డులు నాగేశ్వర్ రెడ్డి, వీరేష్, బాష పాల్గొన్నారు. **కౌతాళం** పోలీసు స్టేషన్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ... నేటి సమాజంలో సైబర్ క్రైమ్ వల్ల అమాయకులు మోసపోతున్నారన్నారు. ఎవరైనా ఫోన్ చేసి 'మీకు డబ్బులు వస్తాయి. ఓటిపి నెంబర్ చెప్పండి' అని ఫోన్ చేస్తే జాగ్రత్తగా ఉండాలన్నారు.

మంత్రాలయంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌతాళంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

వంద పడకల ఆస్పత్రికి తీర్మానం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ఎంసిహెచ్ ఆస్పత్రి 50 పడకల నుంచి వందకు పెంచాలని తీర్మానం చేశామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శుక్రవారం ఎంసిహెచ్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి లత అధ్యక్షతన ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న మార్కెట్ రోడ్డులో ఆస్పత్రికి ఆనుకుని ఉన్న దుకాణాల్లో చికెన్, చేపల విక్రయం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యర్థాలను ఆస్పత్రి ఆవరణలో వేయడం వల్ల కుక్కలు సంచరిస్తున్నాయని, శిశువులను ఎత్తుకొని వెళ్లే ప్రమాదం ఉందని చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి తొలగించాలని తెలిపారు. ఆస్పత్రి స్థాయి 50 పడకలు ఉండడం వల్ల సిబ్బంది అంతంతమాత్రమే ఉన్నారని, వైద్యుల సంఖ్య కూడా తక్కువగా ఉందని చెప్పారు. కాన్పుల విషయంలో కొందరు ఇబ్బందులు పడుతున్నట్లు కూడా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కర్నూలుకు రిఫర్ చేయడం వల్ల అక్కడికి వెళ్లలేక చాలామంది ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు నష్టపోతున్నారని తెలిపారు. ఆస్పత్రి స్థాయిని 100 పడకలకు పెంచాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. అంబులెన్సులు పెంచి సురక్షితంగా కర్నూలు ఆస్పత్రి చేరుకునే చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. పారిశుధ్యం, మందులు, సిబ్బంది కొరత, డ్రెయినేజీ వ్యవస్థపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, సిటీ ప్లానర్ కృష్ణ సింగ్, కౌన్సిలర్ లలితమ్మ, రేణువర్మ దేశాయ్, చంద్రన్న, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మున్సిపల్ కౌన్సిల్ రసాభాస

- టిడిపి, వైసిపి సభ్యుల వాగ్వాదం
- ఛైర్మన్ పోడియం ముందు కూర్చుని నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలు మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన సమావేశం జరిగింది. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన 28 అంశాలను ఆమోదించారు. టిడిపి, వైసిపి సభ్యుల మధ్య మాటల యుద్ధం సాగింది. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘును ఉద్దేశించి 'బెల్ కొట్టి దె...కొని వెళ్తావు' అంటూ టిడిపి సభ్యులు అవమానించారని వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, వైసిపి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కామర్తి నాగేసప్ప, శివ ప్రసాద్, సుధాకర్ ఛైర్మన్ పోడియం ముందు బైఠాయించారు. ఇందుకు ప్రతిగా టిడిపి సభ్యులు దయాసాగర్, రామదాసు గౌడ్‌లు 'మీరే మహిళ కౌన్సిలర్‌ను సిగ్గు లేకుండా పార్టీ మారారని అవమానించార'ని తెలిపారు. ఇరు గ్రూపుల సభ్యులు 'మీరు క్షమాపణ చెప్పాలి. లేదు.. లేదు.. మీరే క్షమాపణ చెప్పాల'ని వాగ్వాదానికి దిగారు. కౌన్సిల్ సమావేశం గందరగోళంగా మారింది. ప్రజా సమస్యలపై చర్చాల్సిన కౌన్సిల్ సమావేశంలో వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలకు వేదికగా మార్చుకోవడం పట్ల పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సభ్యులు ప్రజల మౌలిక సౌకర్యాలపై దృష్టి సారిస్తే బాగుందని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్లు ఇసాక్, వహీద్, అమాన్, బోయ బజారి పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న టిడిపి, వైసిపి సభ్యులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'రాష్ట్రీయ బాల సురక్ష' ద్వారా ఉచిత వైద్య పరీక్షలను వైద్యాధికారి డాక్టర్ అరుణ జ్యోతి, డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అరుణ జ్యోతి మాట్లాడారు. విద్యార్థులకు ఉచిత స్క్రీనింగ్, ఎత్తు, బరువు, ఛాతి కొలత, హిమోగ్లోబిన్, కంటి జబ్బులు, పంటికి సంబంధించిన సమస్యలు, అలాగే పుట్టుకతో వచ్చే 4డి లోపాలు, తరచూ వచ్చే రోగాలు, వయస్సుకు తగ్గ శారీరక, మానసిక పెరుగుదల, అంగవైకల్య లక్షణాలు గుర్తించి అవసరమైన చికిత్సలు చేస్తామని చెప్పారు. అలాగే అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తామని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి రంగస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదాల నివారణకు మూడు శాఖల అధికారులు సంయుక్తంగా నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్, జాతీయ రహదారి శాఖ ఎఇ శేఖర్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి 167పై బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఎమ్మిగనూరు నుంచి మాధవరం వరకు రోడ్డుపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిలుకలడోణ, కలుదేవకుంట, మంత్రాలయం సమీపంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద, చెట్నేహళ్లి, మాధవరం వాగుకు ఇరువైపులా, ఎమ్మిగనూరు పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామని తెలిపారు. అక్కడ రిఫ్లెక్టివ్ మార్క్స్ (రోడ్ స్టడ్) వేయడంతో పాటు ప్రమాదాలను సూచించే బోర్డులు కూడా ఏర్పాటు చేసేందుకు నివేదికలను తయారు చేసినట్లు చెప్పారు. రిఫ్లెక్టివ్ మార్క్స్ వేయడం వల్ల అతి వేగంగా వస్తున్న వాహనాలు వాటిపై వెళ్లడం వల్ల వాహనంలో ఉన్న వారు కంపించే సరికి డ్రైవర్లు అప్రమత్తం అవుతారని, ప్రమాదాల నివారణ జరుగుతుందని పేర్కొన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి.. సిద్ధం చేసిన నివేదికతో జాతీయ రహదారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. అనుమతులు పొంది పనులు చేపడుతున్నట్లు ఎఇ శేఖర్ తెలిపారు. జాతీయ రహదారి నిర్వహణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను, రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని, ఇసుక లాంటివి తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్పాట్‌లను గుర్తిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే బీవీని కలిసిన పీడీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డిని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నివాసంలో బీవీకి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ శాఖ పరిధిలో నియోజకవర్గంలో పనుల గురించి చర్చించారు.

విషజ్వరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : ఎఎన్‌ఎం

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య, ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి - చిప్పగిరి

విష జ్వరాల పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎఎన్‌ఎం సువర్ణ మహిళలకు సూచించారు. శుక్రవారం నేమకల్లు సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైద్యాధికారి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్‌తో పాటు పలు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే సులభంగా జయించవచ్చని చెప్పారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. దోమలు ఎక్కువగా ఉన్న వీధుల్లో దోమతెరలు వాడాలని తెలిపారు. ఆశ కార్యకర్తలు కవిత, ఈరమ్మ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని బొందిమాడుగుల గ్రామ మజరా పంచాయతీ లింగనేనిదొడ్డి గ్రామంలో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గద్వాల కొండలో కొలువైన శ్రీగౌతమ మహాముని తిమ్మగురుడు స్వాముల వారి దేవాలయం నుంచి లింగనేనిదొడ్డి గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్ల దూరం వరకు ఉన్న రోడ్డుకు శుక్రవారం ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు సర్పంచి చౌడప్ప ఆధ్వర్యంలో సర్పంచి గౌరవ సలహాదారులు సలీంద్ర ప్రతాప్ యాదవ్ పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ యాదవ్ మాట్లాడారు. డిసెంబర్ రెండో వారంలో శ్రీగౌతమ మహాముని తిమ్మగురుడు స్వాముల వారి ఆరాధనోత్సవాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. 13 నుంచి 15 వరకు జరిగే ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రోడ్డుకు ట్రాక్టర్లతో మట్టిని తరలించి రోడ్డుకు మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. బొందిమాడుగుల మజరా పంచాయతీ ఉప సర్పంచి కౌలుట్లమ్మ, మాజీ ఉప సర్పంచి చిన్న పులికొండ, వడ్డే సుంకన్న, ఎంపిపి స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, వడ్డే వీరేంద్ర, వడ్డే వెంకటేష్, రంగ నాయకులు పాల్గొన్నారు.

గ్రావెల్‌తో గుంతల పూడ్చివేత

కౌన్సెలింగ్ ఇస్తున్న కమిషనర్

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదురుగా గల న్యూ ఉషా టిఫిన్ సెంటర్‌లో ప్లాస్టిక్ వాడకంపై దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి వస్తువులు ప్యాక్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యజమానులకు రూ.10 వేల జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లలో కట్టిస్తే వినియోగదారులు ప్రశ్నించాలని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన విద్యార్థులు ఎమ్మిగనూరుకు ఎపిఎస్ ఆర్‌టిసి బస్సులో బయల్దేరారు. శుక్రవారం నగరూరు సమీపంలో ప్రయాణిస్తున్న ఎపిఎస్ ఆర్‌టిసి బస్సు డ్రైవర్ రామలింగడుకు షుగర్ లెవెల్స్ తగ్గి రోడ్డు పక్కన ఆపి ఉన్న బైకును ఢీకొట్టి పక్కన ఉన్న పొలంలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. సుమారు 30 మంది విద్యార్థులు క్షేమంగా బయట పడడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు 108 అంబులెన్స్ వాహనంలో డ్రైవర్‌ను ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - పత్తికొండ

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలని పత్తికొండ అర్బన్ సిఐ జయన్న తెలిపారు. శుక్రవారం ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పట్టణంలోని నాలుగు స్తంభాల దగ్గర పత్తికొండ అర్బన్ సిఐ జయన్న సైబర్ క్రైమ్ గోడపత్రికను విడుదల చేశారు. ఆర్‌టిసి బస్సులు, ఆటోలకు స్టిక్కర్లను అంటించారు. సిఐ మాట్లాడుతూ... సైబర్ నేరాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ ద్వారా ఎటువంటి లింక్‌లలో జాయిన్ కాకుండా ఉండాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లా డారు. డిసెంబర్ 2 నుంచి రేషన్ కార్డు కోసం ఆన్‌లైన్ ప్రారంభమ వుతుందని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సొంత స్థలం ఉండి గృహం కోసం దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఆన్‌లైన్‌లోనే ప్రారంభమవుతుంద ని తెలిపారు. పట్టా డాక్యుమెంటేషన్, ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు సమర్పిం చాలని చెప్పారు. సొంత ఇల్లు కావాలనుకున్న వారు హౌసింగ్ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, గోపాల్, గణేకల్లు విరుపాక్షి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

కార్మికుని కుటుంబానికి అండగా ఉంటాం

- వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

ఆటో డ్రైవర్ (కార్మికుడు) కిశోర్ కుటుంబానికి అండగా ఉంటామని వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, టిడిపి పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆటో కార్మికుడు కిశోర్ భార్య హరిజన లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, మాజీ సర్పంచి అవతారం, ఉప సర్పంచి తిక్కయ్య మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆటో యూనియన్ (సిఐటియు) తరఫున రూ.11,200 రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, యూనియన్ నాయకులు ఈరన్న, నాగరాజు, గాదిలింగ, పవన్, తిప్పయ్య స్వామి, రవి ఆటో కార్మికులు అందజేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప సహకారంతో రూ.5 వేలను పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, రాజబాబు అందజేశారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

వీరేష్‌కు వైకుంఠం ప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పంచాయతీ వార్డు సభ్యులు వీరేష్ తండ్రి వెంకప్ప మృతి చెందడంతో శుక్రవారం టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ వీరేష్‌ను పరామర్శించారు. వెంకప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని వీరేష్‌కు ధైర్యం చెప్పారు. సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, టిడిపి మండల మాజీ కన్వీనర్ వెంకటేష్, ఎంపిటిసి నరసప్ప, సంజప్ప, రఘు, ప్రకాష్ నివాళులర్పించారు.

వీరభద్ర గౌడ్ నివాళి

వీరేష్ తండ్రి మృతదేహానికి టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. టిడిపి మండల మాజీ కన్వీనర్ తిమ్మన్న నాయకులు సాయిబాబా, సంజప్ప, సతీష్, యుగంధర్, మధు, మహేష్, మారేష్ ఉన్నారు.

మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శివప్రసాద్

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

- స్కిల్ డెవలప్‌మెంట్ కన్వీనర్ ఆనంద్ రాజ్

ప్రజాశక్తి - ఆదోని

స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వి నియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ కన్వీనర్ ఆనంద్ రాజ్ తెలిపారు. న్యాక్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదోనిలో నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన వచ్చింది. ఇంటర్వ్యూలకు సుమారు 80 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తరగతి నుంచి పిజి చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్ సంస్థలో బ్రాంచి మేనేజర్, కస్టమర్ రిలేషన్ ఆఫీసర్, బ్రాంచి క్రెడిట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. రూ.14 నుంచి రూ.20 వేల వరకు వేతనాలు ఇస్తారని తెలిపారు. కెఎల్ సంస్థ ద్వారా కూడా కొన్ని జాబ్‌లకు అభ్యర్థులు ఎంపికయ్యారని చెప్పారు. వారికి నెలకు రూ.16 వేల వేతనం ఉంటుందన్నారు. ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ప్రతినెలా జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. అవసరమైన మేరకు స్కిల్ డెవలప్ మెంట్‌కు సంబంధించిన శిక్షణను ఉచితంగా ఇస్తున్నామన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సిబ్బంది

నామినేటెడ్ పదవి కోసం

చంద్రబాబుకు వినతి

ప్రజాశక్తి - ఆదోని

వైసిపి ప్రభుత్వంలో కక్ష సాధింపునకు గురై ఆర్థికంగా నష్టపోయామని, నామినేటెడ్ పదవి ఇచ్చి న్యాయం చేయాలని మాజీ కౌన్సిలర్ కల్లుపోతుల రంగన్న కోరారు. శుక్రవారం నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి నామినేటెడ్ ఇవ్వాలని అర్హత పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినట్లు తెలిపారు. కక్షతో వైసిపి నాయకులు భయభ్రాంతులకు గురి చేసి కొబ్బరి, ఎర్రచందనం తోటకు నిప్పు పెట్టి సుమారు రూ.40 లక్షల నష్టాన్ని కలిగించారని వాపోయారు. తన భార్య పేరు మీద ఉన్న రేషన్ షాప్ డీలర్‌షిప్‌ను తొలగించి ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. అప్పట్లో చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా పార్టీ నుంచి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని జరిగిన రూ.40 లక్షల ఆర్థిక నష్టాన్ని ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తానని గతంలో ఇచ్చిన హామీని చంద్రబాబుకు గుర్తు చేశామన్నారు. ప్రభుత్వం ద్వారా నష్టాన్ని ఇప్పిస్తానని ముఖ్యమంత్రి తెలియజేశారన్నారు. గత 40 ఏళ్ల నుంచి పార్టీకి సేవలను చేశానని, నామినేటెడ్ పదవి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను బాబు దృష్టికి తీసుకెళ్లగా త్వరలో అన్ని విషయాలు చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న మాజీ కౌన్సిలర్ రంగన్న

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

అబ్దుల్ కలాం (ఫైల్)

మోటార్ సైకిల్‌ను లారీ వెనుక నుంచి ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు... దేవనకొండ క్రాస్ రోడ్డులో హోటల్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్న హనీఫ్ కుమారుడు అబ్దుల్ కలాం(18) సోదరి కర్నూలు నగరంలోని నన్నూరు టోల్‌గేట్ సమీపంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఆధార్ కార్డులో పేరులో పదాలు తప్పుగా ఉన్నాయని, సరే చేయాలని కళాశాల యాజమాన్యం సూచించింది. ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించడానికి మోటార్ సైకిల్‌పై అబ్దుల్ కలాం వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తతో.. అతివేగంతో ఢీకొట్టింది. అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడు ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. గాయాలకు గురైన యువకుని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. కుమారుడు మరణించడం, ఒక్కడే కావడంతో కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రూ అప్ ఛార్జీల భారం

ప్రభుత్వమే భరించాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎఇ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. రంగన్న, భాస్కర్ యాదవ్, సమీవుల్లా మాట్లాడారు. సిపిఐ నాయకులు జబ్బార్, దాదావలీ, తిమ్మగురుడు, రాజీవ్, మాలిక్, మల్లికార్జున గౌడ్, నరసింహులు, ఖాజా, రవి, మన్సూర్, ఇస్మాయిల్, నరసింహ గౌడ్, అజార్, మురళీ, శంకర్, మద్దిలేటి, సుంకన్న, వీరేష్, విజయ్, వీరేంద్ర, జయరాం, శేఖర్, వెంకటేష్, నాగరాజు, శ్రీరామ్, హనుమంతు, రంగస్వామి, రాజు, మధు, షరీఫ్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'జీనియస్'పై చర్యలు తీసుకోవాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు భరత్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రభుత్వ అనుమతి లేకుండా 8వ తరగతి అడ్మిషన్లు చేసుకుని తరగతులు నిర్వహిస్తున్న గోనెగండ్లలోని జీనియస్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి.భరత్ కుమార్ ఆచారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. పెట్రోల్ బంకు సమీపంలో స్కూల్ ఉండకూడదని తెలిసినా.. ఒకవైపు నోటీసులు ఇస్తూ మరోవైపు చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారుల ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ సంవత్సరం 8వ తరగతికి అనుమతులు లేకున్నా వేరే స్కూల్‌లో అడ్మిషన్లు చేసుకుని ఇక్కడ తరగుతులు నిర్వహిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.